క్లుప్తంగా

విద్యా కిట్ల పంపిణీ

భీమవరం అర్బన్: మండలంలోని వెంప గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం మౌలిక వసతులతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భగవాన్ రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకోవాలి

వీరవాసరం: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరవాసరం శివాలయములో సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రెడ్డి చిన్న సన్యాసిరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకోవాలన్నారు. జిల్లా మహిళా సమన్వయ ప్రముఖ కటకం శెట్టి గోవర్ధన్, ఖండ సంయోజకులు తమ్ము వెంకటరమణమూర్తి , ఖండ సంయోజకులు నవుడు హరిబాబు, నక్కెళ్ళ లక్ష్మి ,మండల మహిళా కన్వీనర్ ఫిరోజీ జైశ్రీరామ్ , పాలపర్తి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ జూనోసిస్ డే

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రపంచ జూనోసిస్ డే కార్యక్రమాన్ని జిల్లా జంతు సంక్షేమ సంఘం, జిల్లా పశు సంవర్థక శాఖ అధ్వర్యంలో పశువుల ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు సంఘం సభ్యులు చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, కొండ్రు శ్రీనివాస్ తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులను జూనోసిస్ అంటారని, ఆటువంటి జబ్బుల గురించి తెలియ చెప్పటానికి జంతు ప్రేమికులకు వాటి గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జంతువులకు ఉచితంగా టీకాలు కూడా వేస్తామన్నారు. రెండు రోజులపాటు విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి ఆ రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తదితర ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో మద్దల చందు, యిర్రింకి భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.


క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో రుద్రహోమం



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం రుద్రహోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ రుద్రహోమంలో 15 మంది దంపతులు పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, మహిళలకు జాకెట్ ముక్కలు, ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముత్యాల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేడపాడు శివాలయంలో మాస శివరాత్రి



ఉమా రామలింగేశ్వరస్వామి

యలమంచిలి: మాస శివరాత్రి సందర్భంగా గురువారం మేడపాడు శివాలయంలో ఆలయ అర్చకులు బాదంపూడి చిరంజీవి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తుల సహకారంతో పూలతో పార్వతీ పరమేశ్వరుల మూల విరాట్టులను సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

18న సైన్స్ టాలెంట్ టెస్ట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గం స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికార్ల అనుమతితో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో పదో తరగతి చదువుతున్న బాల బాలికలకు భారత శివశక్తి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆత్మబంధువులం సేవా సంఘ సభ్యులు తెలిపారు. సేవా సంఘం వారిచే ఈ నెల 18వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మాగంటి సీతారామదాసు కల్యాణ మండపంలో టెస్ట్ జరుగుతుందన్నారు. టెస్ట్ అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు మానసిక వికాస తరగతులు, లాఫింగ్ థెరపీ, భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు, పది కన్సోలేషన్ బహుమతులు అందజేస్తారని చెప్పారు. వివరాలకు సేవా సంఘం అధ్యక్షుడు వెజ్జు దుర్గా ప్రసాద్, ఫౌండర్ సెక్రెటరీ శీతాళం ఉషా కిరణ్‌లను సంప్రదించాలని కోరారు.

వాడవాడలా అగ్గి పిడుగు అల్లూరి జయంతి

- అల్లూరి విగ్రహం పార్లమెంట్‌లో పెట్టాలి
- ఆయన పోరాటం నేటి యువతకు స్ఫూర్తి
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవంలా ప్రకటించడం హర్షణీయం

భీమవరం(ప్రకాశం చౌక్): మన్యం వీరుడు, విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. ఈ సందర్భంగా ఆయన విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలని ప్రజాశక్తి మాజీ సంపాదకులు, రాష్ట్ర రైతు నాయకులు వి.శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా శత వర్ధంతి సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం భీమవరంలో అల్లూరి స్మృతి వనం వద్ద శత వర్ధంతి సభ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆ కమిటీ ఛైర్మన్ బి.బలరాం అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, అత్తిలి, పోడూరు మండల ప్రాంతాల నుంచి బైక్ ర్యాలీతో అల్లూరి స్వగ్రామం మోగల్లు చేరుకొని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా పాలకోడేరు, కుముదవల్లి మీదుగా భీమవరంలో అల్లూరి స్మృతి వనం వద్దకు చేరుకొని అల్లూరి భారీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు జీవితంపై ఆ సంఘం రచించిన పుస్తకాలను వక్తలు ఆవిష్కరించారు. ప్రత్యేక హోదా సాధన సమితి, మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లూరి జీవితం విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మంతెన సీతారాం, బి.బలరాం, కునపరాజు కుమార్, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు సుబ్బతాత రాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, రిటైర్డు జడ్జి మైలా రామ్మూర్తి వర్మ, సీనియర్ రిటైర్డు జడ్జి ఎస్వీ నెల్సన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



భీమవరం అల్లూరి సీతారామరాజు విగ్రహం (స్మృతి వనం) వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర రైతు నాయకుడు వి.శ్రీనివాసరావు



ఉండిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం



ఆకివీడులో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఉద్యమ విధానాలకు స్ఫూర్తి అల్లూరి

భీమవరం(ప్రకాశం చౌక్): ఉద్యమ విధానాలకు స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు. నా దేశం, నా ప్రజలు పరాయి పాలనలో ఉండటం సిగ్గు చేటని విల్లంబులతో మన్యంలో ఉద్యమం సాగించి బ్రిటిష్ వారి గుండెల్లో నిదురపోయిన విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు అని అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. నరసయ్య అగ్రహారంలో అల్లూరి విగ్రహం వద్ద అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య, శ్రీ విజ్ఞాన వేదిక అధ్వర్యంలో అల్లూరి 127వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, గంటా త్రిమూర్తులు, పత్సమట్ల సూర్యనారాయణ రాజు, కె.ప్రదీప్, విన్నకోట వినాయక్, యలమంచిలి శ్రీను, కడలి వెంకటేశ్వరావు, నరహరిశెట్టి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగున అల్లూరికి నివాళులు

పాలకోడేరు: అల్లూరి సీతారామరాజు 127వ శత జయంతి పుష్కరించుకొని విప్లవ వీరుడికి అడుగడుగునా ఘనమైన నివాళులు లభించాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడ లాడించి స్వతంత్ర పోరాటంలో ప్రాణాలు అర్పించిన అల్లూరి పురిటి గడ్డ అయిన మోగల్లులో గురువారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రాష్ట్ర రైతు నాయకులు వి.శ్రీనివాసరావు, ప్రత్యేక హోదా సాధన సమితి మేధావుల ఫారం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం, అల్లూరి శత జయంతి సభ నిర్వహణ కమిటీ చైర్మన్ బి.బలరాం ఇతర నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన అల్లూరి స్మారక మందిరాన్ని శ్రీనివాసరావుతోపాటు ఇతర నేతలు సందర్శించారు.అనంతరం మోగల్లు నుంచి ప్రారంభమైన భారీ మోటార్ సైకిల్ ర్యాలీలో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

అల్లూరి అడుగుజాడల్లో నడవాలి

విప్లవ వీరుడు, మోగల్లు ముద్దుబిడ్డ, స్వర్గీయ అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి వేడుకలు ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్వగ్రామం మోగల్లులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాలు నెరవేర్చాలి

ఆకివీడు: దేశం కోసం పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆయశాల్ని నెరవేర్చే దిశగా ప్రతీ ఒక్కరూ దేశ భక్తిని చాటుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి పిలుపునిచ్చారు. స్థానిక నగర పంచాయతీ ఆవరణలో అల్లూరి జయంతి వేడుకల్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకిత భావంతో యువత పనిచేయాలన్నారు. వైస్ చైర్మన్ వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, గేదల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరిపై నాణెం విడుదల చేయాలి

ఉండి: మన్యం పులి, స్వాతంత్ర్య సమర యోధుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు స్మృత్యర్థం నాణాన్ని విడుదల చేయాలని పలువురు లయన్స్ క్లబ్ ప్రతి నిధులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఉండి గాంధీచౌక్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీతారామరాజు 127 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్లబ్ పరిపాలనాధికారి రుద్రరాజు నరసరాజు, పాలతీర్థపు నర్సింగరావు, కన్నెగంటి రూత్‌కళ, కలిదిండి సీతారామరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, బొండాడ బ్రహ్మానందం, జి.మాధవరాజు, పేరిచర్ల రంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో విశాఖ ఉక్కుపై పోరాటం

భీమవరం అర్బన్: ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడ గడ లాడించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా పోరాటం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భీమవరం మండలంలోని వెంపలో గురువారం విప్లవ జ్యోతి అల్లూరి సీతరామరాజు 127వ జయంతిని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తోటి సుధాకర్‌రావు, మంతెన పండురాజు, రంగయ్య, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



పాలకోడేరులో విప్లవ జ్యోతి అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సీపీఎం నాయకులు

సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

భీమవరం(ప్రకాశం చౌక్): పురపాలక సంఘం పరిధిలో సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అమలు కోసం అన్ని వార్డుల సచివాలయ సిబ్బందికి పురపాలక సంఘ కమిషనర్ ఎమ్.శ్యామల, అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీ విద్య గురువారం ప్రజా ఆరోగ్య, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందికి శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థా నిర్వహణ, మురిగునీటి నిర్వహణ పద్ధతులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రానున్న ఆరు నెలల కాలంలో భీమవరం పురపాలక సంఘ 100% వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు చేరకుండా సమీప ప్రాంతాలలోనే శాస్త్రీయ పద్ధతులలో కంపోస్టింగ్ చేయు విధానాలను అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలలో గ్రీన్ సాలిడ్ ట్రీట్మెంట్ అనుకూలంగా ఉండే ప్రదేశాల గురించి చర్చించారు ఈ సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, మున్సిపల్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతం

ఉండి: నీట్ పరీక్ష పేపర్ లీకేజీను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ గురువారం నిర్వహించిన విద్యా సంస్థల దేశవ్యాప్త బంద్ విజయవంతమయిందని శాఖ మండల కార్యదర్శి జి.శ్రీనివాస్ పత్రికా ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఉండి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌కు సహకరించిన విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశంలోనే అత్యంత విశిష్టమైన నీట్ పరీక్ష దేశ చరిత్రలో ఏనాడు కనీవినీ ఎరుగని విధంగా ఈ సంవత్సరం అవకతవకలు జరగడం దారుణమని ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని బాధిత విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం వారు చెల్లించిన ఫీజులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.పేపర్ లీకేజీపై కేంద్రం బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. నీట్ పరీక్షలో అవకతవకలకు పాల్పడిన ఎన్టీఏను వెంటనే రద్దు చేయాలని కోరారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో విద్యార్థులంతా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.చందు, కె.గోవింద్, డి.ప్రణీత్, పి.సాయి, తదితరులు పాల్గొన్నారు.



యండగండి ప్రభుత్వ స్కూల్‌ను బంద్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యా సంస్థల బంధ్ విజయవంతం

భీమవరం అర్బన్: మండలంలోని విద్యా సంఘాలు గురువారం తలపెట్టిన బంధ్ సంపూర్ణమైంది. ఉదయం నుంచి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, తదితర విద్యార్థి సంఘాల నాయకులు ఉదయం నుంచే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్దకు వెళ్లి మూయించి వేశారు. కొన్ని పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. అసమర్థంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని ఎన్టీఏ ను రద్దు చేయాలని కేంద్ర విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలని పలు చోట్ల ర్యాలీలు, నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాక్షింగా విద్యాసంస్థల మూసివేత

ఆకివీడు: నీట్ నెట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఇచ్చిన పిలపు మేరకు విద్యా సంస్థలు మూసివేశారు. గ్రామాల్లో అక్కడక్కడా పాఠశాలలు పని చేశాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఎల్‌కేజీ నుండి పీజీ వరకూ ఇచ్చిన బంద్ విజయవంతంగా ముగిసిందన్నారు. నీట్ పరీక్ష ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది అవకతవకలు జరిగాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు డి.వసంత్, ఎస్.హేమంత్ పాల్గొన్నారు.

టీడీఎస్‌పై అవగాహన సదస్సు

నరసాపురం రూరల్: ఆదాయపు పన్ను శాఖ నిర్దేశించిన ప్రకారం మినహాయించిన టీడీఎస్ మొత్తాన్ని సకాలంలో ప్రభుత్వానికి జమ చేయాలని టీడీఎస్ అధికారి శ్రీనివాసరావు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మండలంలోని సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కాంట్రాక్టర్లు, వ్యాపారులకు, ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో టీడీఎస్ పై అవగాహనా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదాయపు పన్ను శాఖ టాక్స్ డిడాక్టడ్ సోర్స్ (టీడీఎస్) నిబంధనను అనుసరించి చెల్లింపులు జరిపే ముందు పాన్, టిన్ నెంబర్లు క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి పక్రియ చేపట్టాలని సూచించారు.

వంగవీటి వ్యక్తి కాదు.. మహా శక్తి

పాలకోడేరు: వంగవీటి మోహన రంగా ఒక వ్యక్తి కాదని ఒక మహాశక్తి అని ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. వంగవీటి మోహన రంగా 77వ జయంతి సందర్భంగా పాలకోడేరు మండలంలోని మోగల్లు తదితర గ్రామాలలో గల వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, చిన్నారులకు స్వీట్లను పంపిణీ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, కాపు నాయకులు దొడ్డా రంగా, సాంబ్రాణి సహదేవుడు కొసెట్టి శివ మెగా శ్రీను, పోతుల యేసు పాల్గొన్నారు.

ఆకివీడు: పేదల పాలిటి పెన్నిధిగా నిలిచిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా ఆశయసాధనలో రాధా రంగా మిత్రమండలి కాపు యువత ముందుకు వెళ్లడం అభినందనీయమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక మాదివాడ సెంటర్‌లో రంగా జయంతి ఉత్సవాన్ని గురువారం రాధా రంగా మిత్ర మండలి ప్రతినిధి, కౌన్సిలర్ నిమ్మల నాగు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మిత్ర మండలి ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాపు యువతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ గేదల అప్పారావు, వైసీపీ టౌన్ అధ్యక్షులు అంబటి రమేష్, కుంకట్ల దానయ్య, సత్యనారాయణ, యర్రా కేశవరావు, పుప్పాల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



మోగల్లు లో వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉండి: వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను మండలంలోని వాండ్రంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద్బంగా స్థానిక నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు సందర్శించారు. రక్తదానం చేసిన వారికి పండ్లు అందజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, కందుల బలరాం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరంలో

వీరవాసరం: వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకొని వీరవాసరం, తోలేరు, రాయకుదురు గ్రామాల్లో గురువారం వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని విగ్రహాలకు పూల మాలు వేసి ఘన నివాళులర్పించారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి మోహన్ రంగ

భీమవరం (ప్రకాశంచౌక్): ఒక తరాన్ని శాసించి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి వంగవీటి అని, రాజకీయ పరంగా, సామాజిక పరంగా అందరి మనస్సులో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి వంగవీటి మోహన్ రంగ అని రాధా రంగ మిత్ర మండలి జిల్లా గౌరవాధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ రోడ్డులోని వంగవీటి మోహన్ రంగ విగ్రహం వద్ద మోహన్ రంగ 77వ జయంతి కార్యక్రమాన్ని రాధా రంగ మిత్ర మండలి సభ్యులు సిడ్నీ, బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వంగవీటి మోహన్ రంగ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుంకర చంద్, పాలపర్తి జోనా, చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, పులపర్తి శ్రీను, రాధా రంగ అభిమానులు పాల్గొన్నారు.

భీమవరం పట్టణంలో తాలూకా ఆఫీస్ సెంటర్ లో వంగవీటి మోహన్ రంగ 77వ జయంతి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదవారికి దుప్పట్లు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

నగేష్‌బాబుకు శాసన మండలి ఛైర్మన్ పరామర్శ



నగేష్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: మండలంలోని తుందుర్రు గ్రామంలో పుత్ర శోకంతో బాధపడుతున్న కోయ నగేష్‌బాబు (కాంట్రాక్టర్) కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. ఇటీవల నగేష్ బాబు పెద్ద కుమారుడు కోయ రాజేంద్రరామ్ (20) భీమవరం నుంచి తుందుర్రు గ్రామానికి వస్తుండగా తాడేరు వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో రాజేంద్ర రామ్ అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు నగేష్ బాబును పరామర్శించి ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకొని తన ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. అధైర్య పడొద్దని మేమంతా అండగా ఉన్నామని ధైర్యం చెప్పారు. కొయ్యే మోషేన్‌రాజు వెంట ఆయన కుమారుడు కొయ్యే సుందరరాజు, తదితరులు ఉన్నారు.

నిశాంత వర్మకు ఎక్సలెన్సీ అవార్డు



నిశాంత వర్మకు అవార్డు అందజేస్తున్న ఉండి ఎమ్మెల్యే, తదితరులు

పాలకోడేరు: మోగల్లు లోని అల్లూరి సీతారామరాజు స్మారక ప్రాంతం వద్ద గ్రీనరీ ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేసిన భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత వర్మకు అల్లూరి సీతారామరాజు ఎక్సెలెన్సీ అవార్డు ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌కే నిషాంత్ వర్మ మాట్లాడుతూ తమ వంతుగా అల్లూరి స్మారక ప్రాంతమే కాకుండా మోగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై పోరాడి త్యాగం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి వనంలో సేవలు అందించే అదృష్టం తమ కళాశాలకు దక్కటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సిహెచ్ దిలీప్ చక్రవర్తి, స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.